జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం





## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 3 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 5


## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం కలెక్టరేట్ , ఆగస్టు 2, (ప్రజాజ్యోతి)** నేడు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.,ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కావున సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

- కార్పొరేషన్ హోదా వచ్చి ఏడాది గడిచినా కనిపించని అభివృద్ధి..
- నిధుల కొరతే కారణమంటున్న అధికారులు..!
- ప్రత్యామ్నాయంగా భారీ రుణ ప్రణాళికకు కసరత్తు..!
- మొత్తం రూ.600 కోట్ల ప్రతిపాదనకు నిర్ణయం..!
- రూ.300 కోట్లు ప్రభుత్వ వాటా.. మరో రూ.300 కోట్లు విదేశీ ఆర్థిక సంస్థ రుణం..!
- జూన్ 6 కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదనకు ఆమోదం.. వేగంగా సాగుతున్న డీపీఆర్ ప్రక్రియ..!
- డీపీఆర్ టెండర్, కన్సల్టెన్సీ ఎంపిక ప్రక్రియపై మొదలైన చర్చ..!
- అభివృద్ధితో పాటు కార్పొరేషన్‌పై దీర్ఘకాలిక ఆర్థిక బాధ్యత..!

2 లో..




# అభివృద్ధి కలకు.. అప్పే ఆధారం..!

ఏడాది క్రితం కొత్తగూడెం మున్సిపాలిటీకి కార్పొరేషన్ హోదా వచ్చినప్పుడు పట్టణ ప్రజల్లో భారీ ఆశలు చిగురించాయి. ఈ హోదాతో భారీ నిధులు, విశాల రహదారులు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, మెరుగైన తాగునీటి సదుపాయాలు, ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం, ప్రణాళికాబద్ధమైన పట్టణాభివృద్ధి జరుగుతుందని అందరూ భావించారు. అయితే హోదా వచ్చిన తర్వాత ఎన్నికలు జరిగినా, కార్పొరేషన్ స్థాయికి తగ్గట్టుగా అభివృద్ధి కనిపించ లేదు.

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి




# అధిష్ఠానం మౌనం.. కేడర్‌లో చర్చ

- జిల్లా అధ్యక్షుడిపై కేసు నమోదు తర్వాత బీఆర్ఎస్‌లో చర్చ
- అధిష్ఠానం స్పందన కోసం ఎదురుచూస్తున్న పార్టీ శ్రేణులు
- ◆ ప్రతిపక్షాల విమర్శల మధ్య పార్టీ వైఖరిపై ఆసక్తి
- ◆ దర్యాప్తు కొనసాగుతుండగా రాజకీయ చర్చ మాత్రం వేడెక్కింది

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 2, ప్రజాజ్యోతి:** బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై కేసు నమోదు కావడంతో ఇప్పుడు జిల్లాలో రాజకీయ చర్చ అంతా ఈ అంశంపైనే సాగుతోంది. పోలీసుల దర్యాప్తు కొనసాగుతుండగా, ఈ వ్యవహారంపై పార్టీ ఎలాంటి వైఖరి తీసుకుంటుంది..? అధిష్ఠానం ఎలా స్పందిస్తుంది..? అనే ప్రశ్నలు పార్టీ శ్రేణులతో పాటు రాజకీయ వర్గాల్లోనూ వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు పార్టీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో అందరి చూపు అధిష్ఠానంపైనే ఉంది. జిల్లా అధ్యక్షుడి హోదాలో ఉన్న నాయకుడిపై

మిగతా 2 లో...

## ఫ్రెండ్షిప్ డే రోజున పాల్వంచ మండలంలో విషాదం

- కిన్నెరసాని నదిలో ఈతకు వెళ్లి గల్లంతై యువకుడు మృతి



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 2,(ప్రజాజ్యోతి)** స్నేహితుల రోజున పాల్వంచ మండలం లో విషాద సంఘటన చోటు చేసుకుంది, ఫ్రెండ్షిప్ డే రోజు కావడంతో స్నేహితులతో కలిసి సరదాగా పాల్వంచ మండల పరిధిలోని కిన్నెరసాని పర్యాటక కేంద్రానికి వెళ్లిన కొత్తగూడెం ప్రాంతానికి చెందిన తంగేళ్లపల్లి సంతోష్ అనే వ్యక్తి కిన్నెరసాని డ్యాం కింద భాగాన నీటిలో ఈతకు వెళ్ళాడు, సంతోష్ నీటిలో లోతైన ప్రాంతానికి వెళ్లడంతో నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు దీంతో అక్కడే ఉన్న స్నేహితులు గాలింపు చర్యలు చేపట్టగా సంతోషిని బయటకు తీసి చికిత్స నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు అప్పటికే సంతోష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు, విషయం తెలుసుకున్న పాల్వంచ రూరల్ ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

- టమాటాతో ఆకర్షించి.. ఇతర కూరగాయలపై భారీ దోపిడీ..?
- రూ.10 టమాటా పేరుతో వినియోగదారులను మార్కెట్‌కు రప్పిస్తున్న వ్యాపారులు
- ఇతర కూరగాయలు కొంటేనే టమాటా ఇస్తున్నారనే ఆరోపణలు
- బెండకాయతో పాటు పలు కూరగాయలపై రెండింతలు నుంచి ఆరు రెట్లు ధరలు?
- ప్రతి దుకాణంలో ధరల పట్టిక తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్
- కొనుగోలు, విక్రయ ధరలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక విచారణ చేపట్టాలన్న విజ్ఞప్తి



# రూ.10 టమాటా మాయ..!

**ఇల్లందు, ఆగస్టు 2 (ప్రజాజ్యోతి)** ఇల్లందు నూతన వెజిటేబుల్ మార్కెట్ లో కొందరు వ్యాపారులు అమలు చేస్తున్న వ్యాపార విధానాలపై వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రూ.10కే కిలో టమాటా అంటూ ప్రచారం చేసి ప్రజలను మార్కెట్‌కు ఆకర్షిస్తున్న వ్యాపారులు, అదే సమయంలో ఇతర కూరగాయలపై అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా చేయడం వల్ల అనేకమంది వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

◆ **టమాటా కోసం షరతులా..?**

ఇల్లందు నూతన మోడల్ మార్కెట్ లో కేవలం టమాటా మాత్రమే కొనుగోలు చేయడానికి వచ్చిన వినియోగదారులకు విక్రయించకుండా ఇతర కూరగాయలు కూడా కొనుగోలు చేసినప్పుడే టమాటా ఇస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ఇది వినియోగదారులను

మిగతా 2 లో...

## అధిష్ఠానం మౌనం.. కేడర్‌లో చర్చ

(మొదటి పేజీ తరువాయి...)

కేసు నమోదు కావడంతో ఈ వ్యవహారం సహజంగానే రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. చట్టపరమైన ప్రక్రియ ఒకవైపు కొనసాగుతుండగా, మరోవైపు ప్రతిపక్షాలు ఈ అంశాన్ని రాజకీయంగా ప్రస్తావించడం ప్రారంభించాయి. దీంతో పార్టీ ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కొంటుందన్న అంశం ఆసక్తికరంగా మారింది. గతంలో వివాదాలు వచ్చిన సందర్భాల్లో పార్టీ క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇచ్చిన విషయాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు. అయితే ఈ కేసు విషయంలో అధిష్ఠానం వెంటనే స్పందిస్తుందా, లేక దర్యాప్తు పూర్తయ్యే వరకు వేచి చూస్తుందా అన్నదానిపై పార్టీ శ్రేణుల్లోనే చర్చ జరుగుతోంది. దీనిపై మాత్రం ఇప్పటివరకు బీఆర్ఎస్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారాన్ని రాజకీయంగా ఉపయోగించుకునేందుకు ప్రత్యర్థి పార్టీలు ప్రయత్నిస్తున్నాయనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. దీంతో జిల్లా నాయకత్వానికి సంబంధించిన అంశం కావడంతో దాని ప్రభావం పార్టీపై పడకుండా ఎలా ముందుకు వెళ్లాలన్నది ఇప్పుడు బీఆర్ఎస్ ముందున్న సవాలుగా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ప్రస్తుతం పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. అదే సమయంలో పార్టీ నుంచి వచ్చే అధికారిక స్పందన ఏమిటన్నదే జిల్లా రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది. దర్యాప్తు ఏ దిశగా సాగుతుంది..? అధిష్ఠానం ఎలాంటి వైఖరి తీసుకుంటుంది..? అన్నదానిపైనే ఇప్పుడు పార్టీ శ్రేణులు, రాజకీయ వర్గాలు, ప్రజల దృష్టి నిలిచింది.

## రూ.10 టమాటా మాయ..!

(మొదటి పేజీ తరువాయి...)

తప్పుదారి పట్టించే అన్యాయ వ్యాపార పద్ధతిగా ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### ♦ ఇతర కూరగాయలపై భారీ ధరలు?

రిటైల్ మార్కెట్లో రూ.40కు లభిస్తున్న బెండకాయను నూతన వెజిటేబుల్ మార్కెట్లో రూ.80 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇదే విధంగా పలు కూరగాయలను అసలు మార్కెట్ ధరల కంటే రెండింతలు, మూడింతలు కొన్నిచోట్ల ఐదు నుంచి ఆరు రెట్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

### ♦ రైతు–వినియోగదారులిద్దరికీ నష్టమేనా

రైతుల వద్ద తక్కువ ధరలకు కూరగాయలను కొనుగోలు చేసి వినియోగదారులకు అధిక ధరలకు విక్రయించడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర దక్కకపోవడంతో పాటు ప్రజలు కూడా అధిక భారం భరించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తమవుతుంది.

### ♦ తప్పనిసరిగా ధరల పట్టిక ఏర్పాటు చేయరూ!

నూతన మోడల్ మార్కెట్ లో ప్రతి దుకాణం వద్ద అన్ని కూరగాయల ధరలను స్పష్టంగా ప్రదర్శించే ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ధరల పారదర్శకత ఉంటే అక్రమ ధరల వసూళ్లకు అడ్డుకట్ట పడుతుందని అభిప్రాయపడుతున్నారు. ఇల్లందు నూతన వెజిటేబుల్ మార్కెట్ లో కూరగాయల కొనుగోలు ధరలు, విక్రయ ధరలు, నిల్వలు, బిల్లులు, వ్యాపార లావాదేవీలపై జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మున్సిపల్, వ్యవసాయ మార్కెటింగ్, తూనికలు–కొలతల, వినియోగదారుల పరిరక్షణ శాఖ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా రూ.10 టమాటా పేరుతో ప్రజలను ఆకర్షించి, ఇతర కూరగాయలపై అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు రుజువైతే సంబంధిత వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇల్లందు ప్రజలు జిల్లా యంత్రాంగాన్ని కోరుతున్నారు. ప్రజలను మోసం చేసే ప్రచారాలపై కాకుండా మొత్తం కూరగాయల ధరల వ్యవస్థపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేస్తున్నారు.



- కార్పొరేషన్ హోదా వచ్చి ఏడాది గడిచినా కనిపించని అభివృద్ధి..
- నిధుల కొరతే కారణమంటున్న అధికారులు..!
- ప్రత్యామ్నాయంగా భారీ రుణ ప్రణాళికకు కసరత్తు..!
- మొత్తం రూ.600 కోట్ల ప్రతిపాదనకు నిర్ణయం..!
- రూ.300 కోట్లు ప్రభుత్వ వాటా.. మరో రూ.300 కోట్లు విదేశీ ఆర్థిక సంస్థ రుణం..!
- జూన్ 6 కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదనకు ఆమోదం.. వేగంగా సాగుతున్న డీపీఆర్ ప్రక్రియ..!
- డీపీఆర్ టెండర్, కన్సల్టెన్సీ ఎంపిక ప్రక్రియపై మొదలైన చర్చ..!
- అభివృద్ధితో పాటు కార్పొరేషన్‌పై దీర్ఘకాలిక ఆర్థిక బాధ్యత..!




# అభివృద్ధి కలకు.. అప్పే ఆధారం..!

**ఏడాది క్రితం కొత్తగూడెం మున్సిపాలిటీకి కార్పొరేషన్ హోదా వచ్చినప్పుడు పట్టణ ప్రజల్లో భారీ ఆశలు చిగురించాయి. ఈ హోదాతో భారీ నిధులు, విశాల రహదారులు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, మెరుగైన తాగునీటి సదుపాయాలు, ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం, ప్రణాళికాబద్ధమైన పట్టణాభివృద్ధి జరుగుతుందని అందరూ భావించారు. అయితే హోదా వచ్చిన తర్వాత ఎన్నికలు జరిగినా, కార్పొరేషన్ స్థాయికి తగ్గట్టుగా అభివృద్ధి కనిపించ లేదు.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

రహదారులు, డ్రైనేజీ, మురుగునీటి వ్యవస్థ, ట్రాఫిక్, పట్టణ విస్తరణ వంటి సమస్యలు యథాతథంగానే ఉండటంతో నిధుల కొరతే ప్రధాన అడ్డంకిగా మారిందనే చర్చ సాగుతోంది. ఈ పరిస్థితుల్లో అభివృద్ధి వేగవంతం చేయాలంటే రుణమే ప్రత్యామ్నాయ మార్గంగా అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో 'అభివృద్ధి కలకు... అప్పే ఆధారం' అన్న పరిస్థితి కొత్తగూడెం కార్పొరేషన్‌లో నెలకొంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు రూ.600 కోట్ల భారీ అభివృద్ధి ప్రణాళిక తెరపైకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

### ♦ రుణ ప్రక్రియ షురూ..!

పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి కోసం కార్పోరేషన్ వర్గం సుమారు రూ.600 కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇందులో రూ.300 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాగా, మరో రూ.300 కోట్లు విదేశీ అభివృద్ధి ఆర్థిక సంస్థ నుంచి రుణంగా సమీకరించే ప్రతిపాదనపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే దీనికి సంభందించి కాన్సెప్ట్ నోట్ సిద్ధం చేయగా, తదుపరి ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఈ ఏడాది జూన్ 6న జరిగిన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. ప్రస్తుతం డీపీఆర్ టెండర్ ప్రక్రియ, కన్సల్టెన్సీ ఎంపిక కొనసాగుతున్నాయి. సాధారణంగా ఇలాంటి ప్రాజెక్టుల్లో పట్టణానికి అవసరమైన పనులు, వాటి అంచనా వ్యయం, అమలు విధానం, కార్పొరేషన్ ఆర్థిక పరిస్థితి, ప్రస్తుత ఆదాయ వనరులు, భవిష్యత్తు ఆదాయ అవకాశాలు, రుణాన్ని తిరిగి చెల్లించే సామర్థ్యం వంటి అంశాలను పరిశీలించి డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) రూపొందిస్తారు. ఆ నివేదిక ఆధారంగానే రుణ సంస్థ తుది నిర్ణయం తీసుకుని, దశలవారీగా నిధులు విడుదల చేస్తుంది.

### ♦ వనరులు... భవిష్యత్తు భారం..!

కార్పొరేషన్‌కు ప్రధాన ఆదాయం ఆస్తి పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్సులు, భవన అనుమతుల రుసుములు, మార్కెట్ ఫీజులు తదితర స్థానిక ఆదాయ వనరుల నుంచే వస్తుంది. వీటితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తిరిగి చెల్లించాల్సిన అవసరం లేని ప్రత్యేక నిధులు కూడా అందుబాటులో ఉంటాయి. కొత్తగూడెంలో కేటీపీఎస్, సింగరేణి ప్రధాన కార్యాలయం వంటి భారీ ప్రభుత్వ రంగ సంస్థలు ఉండటం వల్ల డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్ నిధులు పొందే అవకాశాలు కూడా ఉన్నాయి. అంటే రుణం కాకుండా ఇతర మార్గాల ద్వారా కూడా అభివృద్ధి నిధులు సమీకరించే అవకాశం ఉందనే మాట. అయితే ఈ అవకాశాలన్నింటినీ పూర్తిగా వినియోగించిన తర్వాతే రుణం తీసుకునే నిర్ణయానికి వచ్చారా..? లేక నేరుగా రుణ ప్రతిపాదనకే ప్రాధాన్యం ఇచ్చారా..? అనే చర్చ ఇప్పుడు పట్టణంలో సాగుతోంది. ఇదే సమయంలో ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.300 కోట్ల వాటా నిధులు పూర్తిస్థాయిలో, సమయానికి అందుతాయా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ప్రతిపాదన ప్రకారం మొత్తం రూ.600 కోట్ల ప్రాజెక్టులో రూ.300 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాగా, మరో రూ.300 కోట్లు విదేశీ అభివృద్ధి ఆర్థిక సంస్థ నుంచి రుణంగా సమీకరించనున్నట్లు తెలుస్తోంది. అయితే రుణంగా తీసుకొచ్చే నిధులు ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ముగిసిపోయే వ్యవహారం కాదు. ఒప్పందంలోని నిబంధనల ప్రకారం వడ్డీతో పాటు నిర్ణీత గడువులో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. అందుకే ఈ ప్రాజెక్టు ఒకవైపు కొత్తగూడెం అభివృద్ధికి ఊతమిస్తుందనే ఆశలు కనిపిస్తుండగా, మరోవైపు భవిష్యత్తులో కార్పొరేషన్‌పై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉందనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది.

### డీపీఆర్‌పైనే అందరి దృష్టి..!

రూ.600 కోట్ల ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ కన్సల్టెన్సీ ఎంపికకు నోటిఫికేషన్ జారీ చేసి టెండర్ ప్రక్రియ ప్రారంభించారు. అయితే ఈ ప్రక్రియలోని పలు అంశాలపై ఇప్పటికే చర్చ మొదలైంది. నోటిఫికేషన్ ఎప్పుడు విడుదల చేశారు..? టెండర్లు దాఖలు చేసేందుకు ఎంత గడువు ఇచ్చారు..? ఎన్ని సంస్థలు బిడ్డింగ్‌లో పాల్గొన్నాయి..? కన్సల్టెన్సీ ఎంపికకు ఏ ప్రమాణాలు అనుసరిస్తున్నారు..? డీపీఆర్ తయారీకి ఒక నిర్దిష్ట మొత్తాన్ని నిర్ణయించారా..? లేక మొత్తం రూ.600 కోట్ల ప్రాజెక్టు విలువ ఆధారంగా శాతం ప్రకారం కన్సల్టెన్సీ ఫీజు చెల్లించనున్నారా..? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే సమయంలో ప్రతిపాదిత పనుల ఎంపిక, వ్యయ అంచనాలు, ప్రాధాన్యత క్రమం, నిధుల కేటాయింపు వంటి అంశాలపైనా చర్చ కొనసాగుతోంది. ఈ ప్రాజెక్టుకు డీపీఆర్‌నే తొలి అడుగు కావడంతో, అందులో తీసుకునే నిర్ణయాలే భవిష్యత్తులో చేపట్టే పనుల దిశను నిర్ణయించే అవకాశం ఉంది. దీంతో తుది డీపీఆర్‌లో ఏ పనులకు ప్రాధాన్యం ఇస్తారు..? వ్యయ అంచనాలను ఏ ప్రాతిపదికన రూపొందిస్తారు..? అనే అంశాలపైనే ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. మొత్తానికి కార్పొరేషన్ హోదా వచ్చిన తర్వాత ఆశించిన స్థాయిలో అభివృద్ధి కనిపించని కొత్తగూడెంలో ఇప్పుడు రూ.600 కోట్ల ప్రాజెక్టు కొత్త చర్చకు దారితీసింది. ఒకవైపు పట్టణాభివృద్ధిపై ఆశలు కనిపిస్తుండగా, మరోవైపు, టెండర్ ప్రక్రియ, కన్సల్టెన్సీ ఎంపిక, డీపీఆర్ రూపకల్పన, రుణంతో ముడిపడిన ఆర్థిక బాధ్యతలపై ఆసక్తి పెరుగుతోంది.

# స్నేహితుల దినోత్సవం సందర్భంగా పాత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

- మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సందేశం



**మణుగూరు, ఆగస్టు 2, ప్రజా జ్యోతి** మండల పరిధిలోని శివలింగాపురం సి.యు.పి.ఎస్. (CU PS) పాఠశాలలో 1996 నుండి 2002 వరకు వివిధ సంవత్సరాల్లో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా స్నేహితులందరూ కలిసి తాము చదువుకున్న పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయు లు, పాఠశాల ప్రాంగణం, తరగతి గ దులను సందర్శిస్తూ విద్యార్థి దశలోని మధుర స్మృతులను పంచుకున్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్క లు నాటి వాటిని సంరక్షించాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా స్నేహితుడులాలు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం స్నేహితుల దినోత్సవం సందర్భంగా అందరం కలిసి మా పాఠశాలలో సమావేశమై ఈ వేడుకను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నామని తెలిపారు. చిన్ననాటి స్నేహబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు జీవితంలో ఎదురయ్యే సమస్యలు, సంతోషాలు, అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ పరస్పర సహకారంతో ముం దుకు సాగుతున్నామని చెప్పారు. ఇ లాంటి కార్యక్రమాలు స్నేహబంధాలను చిరస్థాయిగా నిలబెట్టడమే కా కుండా సమాజానికి, పర్యావరణానికి కూడా మంచి సందేశాన్ని అందిస్తాయని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో లక్ష్మి, లాలు, రవి ప్రసాద్, రమేష్, రాజేశ్వరరావు, ఇస్మాయిల్, అశోక్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆషాడ బోనాలతో సందడిగా జానకీపురం శ్రీ సత్తెమ్మ తల్లి ఆలయం

- మహిళల భక్తిశ్రద్ధల మధ్య ప్రత్యేక పూజలు..
- గ్రామ శ్రేయస్సు కోసం ప్రార్థనలు





**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 2 (ప్రజా జ్యోతి ):**అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల జానకీపురం గ్రామంలో వెలిసియున్న శ్రీ సత్తెమ్మ తల్లి ఆలయంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.దాదాపు 200మంది మహిళలు ఈ బోనాల ఉత్సవాల్లో పాల్గొని గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని శ్రీ సత్తెమ్మ తల్లిని వేడుకున్నారు. భక్తులు అమ్మవారి నామ స్మరణలతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. బోనాల సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ బోనాల వేడుకలు గ్రామంలో భక్తి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచాయి.

## రేణుక ఎల్లమ్మకు బోనాల సమర్పణ



**చర్ల, ఆగష్టు 02(ప్రజాజ్యోతి ):** లక్ష్మి కాలనీ గ్రామపంచాయతీ పరిధిలోని జాంబవంతుడి గుట్టపై కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో ఆదివారం బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారులు పూనెం చంటి, మడకం దేవా ఆధ్వర్యంలో, గ్రామ పెద్దలు మడకం చందు, తోలెం మల్లయ్య సారథ్యంలో మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.బోనాల మహోత్సవానికి శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ మహాక్షేత్రం చిన్న అరుణాచలం వ్యవస్థాపకులు శివనాగ స్వామి హాజరై అమ్మవారికి చీర, జాకెట్ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించా రు.ఈ సందర్భంగా శివనాగ స్వామి మాట్లాడుతూ ఆషాఢ మాసంలో గ్రామదేవతలను ఆరాధించే అత్యంత పవిత్రమైన పండుగ బోనాల పండుగ అని అన్నా రు. గ్రామ ప్రజలందరి కష్టాలు తొలగిపోయి సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మహిళలు కొత్త కుండలో వండిన అన్నం, పప్పు, బెల్లం, పాలతో తయారు చేసిన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పిస్తూ "చల్లగా చూడు తల్లి" అంటూ భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించడం ఆనవాయితీ అని తెలిపారు.అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## శ్రీరామ హృదయ కలశ యాత్ర

**చర్ల, ఆగస్టు 02(ప్రజాజ్యోతి ):**శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి మంగళ శాసనాలతో నిర్వహిస్తున్న శ్రీరామ హృదయ కలశ యాత్ర ఆదివారం చర్ల మండలంలో భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది.చర్ల బస్టాండ్ సమీపంలోని ఏడు ద్వారాల వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన శ్రీరామ హృదయ కలశాన్ని లింగాపురం గ్రామంలోని శ్రీ కోదండరామాలయం వరకు పెద్దలు, గ్రామస్తులు, మహిళలు, యువకులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అంగరంగ వైభవంగా తీసుకువెళ్లారు. లింగాపురంపాడు గ్రామదేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం నుంచి మేళతాళాలు, భాజాభజంత్రీలు, భక్తి గీతాల మధ్య కలశయాత్ర కొనసాగింది.దారిపొడవునా భక్తులు బిందెలతో నీటి ధారలు పోస్తూ, "జై శ్రీరామ్.. జై శ్రీరామ్" అంటూ నినాదాలు చేస్తూ కలశాన్ని శ్రీ కోదండరామాలయానికి చేర్చారు. ఆలయానికి చేరుకున్న భక్తులు శ్రీరామ హృదయ కలశంలో గుప్పెడు బియ్యం సమర్పించి, కలశాన్ని స్పర్శించి భక్తిశ్రద్ధలతో నమస్కరించారు.ఈ సందర్భంగా చర్ల వికాస్ తరంగిణి సంస్థకు చెందిన పురుషోత్తం భక్తులకు శ్రీరామ హృదయ కలశం విశిష్టతతో పాటు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి ఆధ్యాత్మిక సేవలను వివరించారు.అనంతరం భగవద్గీత సప్తాహ కమిటీ ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం వందలాది మంది భక్తులు, గ్రామస్తుల సమక్షంలో భక్తి భావంతో నిర్వహించారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



## గొంపల్లిలో ముత్యాలమ్మ జాతర ప్రారంభం



**చర్ల, ఆగస్టు 02(ప్రజాజ్యోతి ):** చర్ల మండలంలోని గొంపల్లి గ్రామంలో గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఆదివారం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ప్రారంభమైంది. జాతర సందర్భంగా గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేయడంతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. జాతర సందర్భంగా గ్రామమంతా భక్తి వాతావరణం నెలకొంది. జాతర నిర్వహణలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు చురుకుగా పాల్గొని భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో తోటమల్ల రవికుమార్, కొంగూరు మురళి, చిట్టిమల్ల మురళి, తోటముళ్ల సందీప్, భయ్యా వెంకటేశ్వర్లు, గండూరి వెంకటేశ్వర్లు, కొంగూరు రాజా, భోగాల చందు, తోకల సాయికుమార్, నక్క సాగర్, తోటమల్ల వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలంపాడులో బైక్ ప్రమాదం... మహిళకు తీవ్ర గాయాలు



**టేకుల ప ల్లి, ఆ గ స్టు 0 2, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. రాంపురం తండాకు చెందిన ధర్మావత్ జానకి సుజాతనగర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా,ముత్యా లంపాడు గ్రామంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ వెనుక కూర్చున్న జానకి అదుపుతప్పి కిందపడిం ది.ఈ ప్రమాదంలో ఆమె తల వెనుక భాగానికి తీవ్ర గాయమైం ది.సమాచారం అందుకున్న 108 అత్యవసర అంబులెన్స్ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని బాధితురాలికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం టేకులపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సహాయక చర్యల్లో 108 ఈఎంటీ రాధా,పైలెట్ వెంకట రామారావు పాల్గొన్నారు. స్థానికులు 108 సిబ్బంది వేగంగా స్పందించిన తీరును అభినందించారు.

## మద్రాస్ తండలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

- గ్రామాభివృద్ధికి కాంగ్రెస్ నాయకుల కృషి



**టేకులపల్లి,ఆగస్టు02,ప్రజాజ్యోతి:**టేకులపల్లి మండలంలోని మద్రాస్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్–ఉమా స్థానిక నాయకులు, గ్రామ పెద్దలతో కలిసి కొబ్బరికాయ కొట్టి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ పనులను చేపట్టినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిర్మాణ పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో మద్రాస్తండా సర్పంచ్ మాలోత్ గాంగ్లి, ఉపసర్పంచ్ జరుపుల లింగ, గ్రామస్తులు భద్రం, సాధు, దసురు, రాజేష్, కిషన్, లాల్చంద్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై

# సమరశంఖం పూరించాలి

- సామాన్యుల నడ్డి విరుస్తున్న ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టలి
- ఆగస్టు 6 నుంచి 12వరకు సిపిఐ జిల్లా ప్రజా చైతన్య యాత్రలు. జయప్రదం చేయండి
- సెప్టెంబర్ 1న 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలి
- జిల్లా రైతాంగానికి సీతారామ ప్రాజెక్టు సాగునీరు ఇవ్వాలి
- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం





**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 2, (ప్రజా జ్యోతి)** సీతారామ, సీతమ్మధార ప్రాజెక్టుల ద్వారా జిల్లా రైతాంగానికి సాగు జలాలు అందించాలని సిపిఐ సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. పాల్వంచ లోని 'సిఆర్ భవన్'లో ఆదివారం కోటి తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన పాల్వంచ మండలం కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏళ్లు గడుస్తున్నా అర్హులైన రైతులకు పోడు పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం తగదన్నారు. నిరుపేదలకు ఇళ్లు, స్థలాలు కేటాయించడంలో తీవ్ర వైఫల్యం చెందిందని, సీతారామ ప్రాజెక్టు సాగునీరు పాల్వంచ మండలంలోని రైతాంగానికి ఇవ్వాలని., ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. పాల్వంచలో 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండు విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, స్కీం వర్కర్ల జీవితాలతో ఆటలాడకుండా ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు అమలయ్యేలా చూడాలన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంలో నిర్లక్ష్యం సరికాదన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా ఆగష్టు 6 నుండి 12 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రజాచైతన్య యాత్రలు పాల్వంచ మండలంలో 8 వ తారీకు రంగాపురం నుండి చంద్రాల గూడెం వరకు చేపడుతున్నామని, రాబోయే రోజుల్లో సిపిఐ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్మిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, చెన్నయ్య. వేములపల్లి శ్రీనివాసరావు, కొంగర అప్పారావు, రంజిత్, ఆవుల సతీష్, సర్పంచులు కురసం రాములు, బానోత్ రవికుమార్, నిషా రాణి, సరస్వతి, మజ్జా కృష్ణవేణి, నిట్ట అమృత రావు. ఉంద్రాతి రవి. వాజ్జ.వాసు,బోళ్ల ఉపేందర్ రెడ్డి ఎస్.కె కాసిం సున్నం బాబు రావు అవినాష్ ఇరుకులపాటి సుధాకర్ కుంజ రాందాస్ లవుడియా చందులాల్ సఫావట్ వెంకటరమణ మేక రాంబాబు ఎడవల్లి కృష్ణ , అలెం సమ్మయ్య వజ్జ వెంకన్న పూనం మల్లయ్య, జాలే బాబు, జరుపుల మోహన్ రావు, బాదావత్ శ్రీను రాంబాబు, జరుపుల కిషన్ భూక్య రమేష్ జక్కుల లింగేశ్వర్, లచ్చిరాం, మహంకాళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలంపాడులో ఘనంగా ఆషాఢ బోనాలు





**ములకలపల్లి, ఆగస్టు 2 (ప్రజాజ్యోతి):** మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో ఆదివారం ఆషాఢ బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో సిద్ధం చేసిన బోనాలను శిరస్సుపై ధరించి డప్పు వాయిద్యాలు, సంప్రదాయ నృత్యాల నడుమ గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం శ్రీ ముత్యాలమ్మ తల్లికి బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కుంజా జగన్, కారం వంశీ, మడకం లలిత, అడపా పద్మ, మడివి నాగలక్ష్మి, కణితి సునీత, మడకం భాయమ్మ, చిట్టెమ్మ, పొడియం సుమలతతో పాటు గ్రామ మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాకరకాయ కలిగే ఆరోగ్య ప్రయోజనాలు

కాకరకాయ రసం అనేది కాకరకాయ నుండి తయారుచేసే ఒక చేదు మూలికా పానీయం. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి, జీర్ణక్రియకు సహాయపడటానికి మరియు రోగనిరోధక శక్తిని పెంచడానికి దీనిని ఆయుర్వేదంలో విస్తృతంగా ఉపయోగిస్తారు. భారతదేశంలో ప్రసిద్ధి చెందిన బాటిల్ రకాలలో న్యూట్రియోర్గ్ కాకరకాయ జ్యూస్ మరియు కపివా కాకరకాయ జామున్ జ్యూస్‌ఉన్నాయి .

### ››› ఆరోగ్య ప్రయోజనాలు....

మొక్కల ఇన్సులిన్ సమ్మేళనాలను ఉపయోగించి రక్తంలో చక్కెరను తగ్గిస్తుంది

కాలేయాన్ని శుభ్రపరుస్తుంది మరియు రక్తాన్ని శుద్ధి చేస్తుంది

పేగు ఆరోగ్యాన్ని మరియు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది

బరువు నిర్వహణకు సహాయపడుతుంది

### ››› ఎలా వినియోగించాలి.....

30 మిల్లీలీటర్ల జ్యూస్‌ను అంతే పరిమాణంలో గోరువెచ్చని నీటితో కలపండి.

ఉదయం పూట ఖాళీ కడుపుతో తాగండి.

అధిక మోతాదు కడుపు నొప్పికి కారణం కావచ్చు కాబట్టి, దీనిని రోజుకు ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే తీసుకోవాలి.



## ఈ నెల 10న జైల్ భరోను విజయవంతం చేయాలి



**ములకలపల్లి, ఆగస్టు 2 (ప్రజాజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 10న దేశ వ్యాప్తంగా నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సదస్సు లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లతో పాటు ఉపాధి హామీ పథకానికి నష్టం కలిగించే వీబీజీ రామ్‌జీ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కార్మికులకు ఏడాదికి 200 రోజుల పని, రోజుకు రూ.600 కూలీ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పిట్టల అర్జున్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు, తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మాలోతు రావూజీ, గౌరీ నాగేశ్వరరావు, సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు, గోపగాని లక్ష్మీనరసయ్య, పాయం అమల, భూక్యా శ్రీదేవి, భూక్యా సామిని, క్రాంతి, గడ్డం వెంకటేశ్వర్లు, వినోద్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిరసన దినంగా పాటిద్దాం

- జోగా గోవర్ధన్



**టేకులపల్లి,ఆగస్టు02,ప్రజాజ్యోతి:** ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిరసన దినంగా పాటించాలని తుడుం దెబ్బ జిల్లా కార్యదర్శి జోగా గోవర్ధన్ పిలుపునిచ్చారు. ఆదివారం తుడుం దెబ్బ ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. గిరిజనుల భూ హక్కులు, రిజర్వేషన్లు, భాషా గుర్తింపు, రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ నిబంధనల అమలు కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లావణి, సీలింగ్, పోడు భూములను సాగు చేస్తున్న ఎస్టీలకు శాశ్వత హక్కులతో పట్టాలు ఇవ్వాలని కోరారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వట్టం నాగేంద్ర, నాగయ్య, శేకర్, జోగా వంశీ పాల్గొన్నారు.